


పేదరిక నిర్మూలనే లక్ష్యంగా...

## పీ 4 సర్వే

ఈ నెల 8 నుంచి 18 వరకు సచివాలయ సిబ్బంది ద్వారా కార్యక్రమం

కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



వివరాలు 2లో...

18వ వసంతంలోకి...
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
శుక్రవారం 7 మార్చి 2025
పేజీలు 8



### విజయవాడ నగర సమగ్రాభివృద్ధికి

# సత్వర డీపీఆర్‌లు

**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, మార్చి 6, మేజర్ న్యూస్ :** రాష్ట్ర రాజధాని అమరావతికి ముఖద్వారమైన విజయవాడ నగర అవసరాలకు తగ్గట్లు ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన సవివిర ప్రాజెక్టు నివేదికల (డీపీఆర్) రూపకల్పనపై వివిధ శాఖల అధికారులు కృషిచేయాలని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సీపీ ఎస్‌వీ రాజశేఖరబాబు సూచించారు. మిగతా 2లో...

- విస్తృత ప్రజాప్రయోజన మౌలిక వసతుల పనులపై ప్రత్యేక దృష్టి
- రహదారుల విస్తరణ, సుందరీకరణ పనులకు ప్రాధాన్యం
- ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ రహదారులు
- కాలువ కట్టల సుందరీకరణ, వాకింగ్ ట్రాక్‌లు, ఫుడ్‌కోర్టుల ఏర్పాటుకు చర్యలు
- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సీపీ ఎస్‌వీ రాజశేఖరబాబు

### విజయవంతంగా ముగిసిన

## మహిళా ఉద్యోగుల క్రీడా పోటీలు

విజేతలకు 8న బహుమతులు ప్రదానం

మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయండి

ఎన్జీజీవో నేతలు కేవీ శివారెడ్డి, ఎ.విద్యాసాగర్



**విజయవాడ మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఎన్జీజిఓ రాష్ట్ర మహిళా విభాగం నిర్వహిస్తున్న క్రీడలకు పెద్ద ఎత్తున మహిళా ఉద్యోగుల నుంచి అన్నూహ్య స్పందన లభించిందని గతంలో ఎన్నడూ లేనివిధంగా అన్ని శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు పోటీలలో పాల్గొని ప్రతిభను ప్రదర్శించారని మిగతా 2లో

### భవిష్యత్తుకు భరోసా కల్పించడమే..

## రైతుకిచ్చే నిజమైన గౌరవం

పంటకు సరైన ధర చెల్లించి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచాలి

ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్

**గన్నవరం, మార్చి 6, మేజర్ న్యూస్ :** ఆరుగాలం కష్టపడే రైతు పండించిన పంటకు సరైన ధర చెల్లించి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచి, భవిష్యత్తుకు భరోసా కల్పించడమే రైతుకి ఇచ్చే నిజమైన గౌరవమని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీ సమావేశాలలో నియోజకవర్గంలోని పలు సమస్యలను సభ దృష్టికి తీసుకు వచ్చారు. ఎన్డీయే ప్రభుత్వంలో రైతులకు ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే ఖాతాల్లో డబ్బు జమ అయ్యే పరిస్థితి వచ్చిందని.. రైతు తాము పండించిన పంటను ఆర్ ఎస్ కె ద్వారా సులభంగా మిల్లులుకు తరలించే సౌకర్యం ఈ ప్రభుత్వం కల్పించిందన్నారు. మిగతా 8లో





(మొదటిపేజీ తరువాయి)

### విజయవంతంగా ముగిసిన మహిళా ఉద్యోగుల క్రీడా పోటీలు





ఏపీ ఎన్జీజీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి ఏ.విద్యా సాగర్ తెలిపారు. స్థానిక ఇందిరా గాంధీ స్టేడియం, దండమూడి రాజగోపాల్ ఇండోర్ స్టేడియం గాంధీ నగర్ ఎన్జీజీవో హోంలో 4, 5, 6 తేదీలలో మూడు రోజులపాటు మహిళా ఉద్యోగుల ఆటలు పోటీల నిర్వహించడం జరిగిందన్నారు. మహిళా ఉద్యోగులకు మానసిక ధైర్యం, ఆహ్లాదకర జీవితం అవసరమని ఇందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన టాగ్ ఆఫ్ వార్ లెమన్ అండ్ స్పూన్ మ్యూజికల్ చైర్ అత్యాక్షరి షటిల్ బ్యాట్మింటన్ చెస్ కేరమ్స్ వ్యాస రచన పాటలు నృత్య పోటీలలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజైన ఈనెల 8న విజయవాడ ఎన్జీవో హోంలో జరిగే కార్యక్రమంలో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని తెలిపారు. మహిళా విభాగం నాయకురాలు నిర్మల కుమారి మాధవి రాజ్యలక్ష్మి తదితరుల ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేస్తారని మహిళా ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

### ఆలయంలో విగ్రహాలు పునః ప్రతిష్టాపన



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్థానిక ఈడేపల్లి కురుమవీధి లో జీర్ణోద్ధరణ చేసిన ప్రాచీన శ్రీ అయోధ్య రామ, బీరప్ప స్వామి ఆలయంలో విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమం విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ ఘనాపాఠి, వారి శిష్య బృందం బ్రహ్మత్వం లో గురువారం విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఉదయం మొదటిగా గణపతి పూజ, పుణ్యాహావచనము, గర్భాలయములో గర్తన్యాసం, రత్న న్యాసం, ధాతున్యాసం అనంతరం యంత్రస్థాపన, విగ్రహ ప్రతిష్టాపన, శిఖర ప్రతిష్ట,అవహిత దేవతా హోమములు, పూర్ణాహుతి, మంటపోద్వాసన, కళాన్యాసం, నేత్రోన్మీలనము అనంతరం కుంభ జలాభిషేకం, గోవుదర్పణము, కుంభము, భక్తులకు దివ్యదర్శనము, దీక్షాదారులకు ఆశీర్వచనం, దీక్ష విసర్జన, మహా మంగళహారతి మొదలైన కార్యక్రమాలు జరిగాయి. గురువారం మధ్యాహ్నం గొప్ప అన్న సమారాధన కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో వందలాదిమంది భక్తులు పాల్గొని ప్రతిష్టాపన మహోత్సవంలో పాలుపంచుకున్నారు.



# పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ 4 సర్వే



**ఈ నెల 8 నుంచి 18 వరకు**

**సచివాలయ సిబ్బంది ద్వారా కార్యక్రమం**

**జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్ (పీ 4) సర్వేకు రూపకల్పన చేయడం జరిగిందని, ఈ నెల 8 వ తేదీ నుండి 18వ తేదీ వరకు జరిగే సర్వేను వేగవంతం చేసి, సమర్ధవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక మందిరంలో ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులకు పీ 4 సర్వేపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీ పాల్గొని పలు సూచనలు చేశారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా ఈ సర్వే నిర్వహించడం జరుగుతుందని, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు తమ పరిధిలోని సచివాలయ సిబ్బందికి సర్వేపై పూర్తిస్థాయిలో శిక్షణనిచ్చి అవగాహన కల్పించాలన్నారు. పేదరికం తో అట్టడుగున ఉన్న పేద కుటుంబాలకు మద్దతుగా నిలిచేలా ప్రోత్సహించడం, పీ 4 విధానం లక్ష్యమని వివరిస్తూ పేదల అవసరాలను గుర్తించి వారి సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టుల రూపకల్పనకు ఈ సర్వే దోహదం చేస్తుందని, సర్వేలో ఖచ్చితమైన డేటాను సేకరించాలని సూచించారు. ఆయా కుటుంబాలు ప్రస్తుతం అందుకుంటున్న పథకాలపై ఈ సర్వే ఎలాంటి ప్రభావం చూపదని స్పష్టం చేస్తూ సర్వే ద్వారా సేకరించిన డేటా ఆధారంగా ఇంటి అవసరాలకు అనుగుణంగా సమర్ధవంతమైన ప్రణాళికల రూపకల్పనకు వీలవుతుందన్నారు.

ఆయా కుటుంబాలకు సమాచారాన్ని క్షుణ్ణంగా వివరించి వారికున్న అపోహాలు తొలగించి, సర్వేను పది రోజుల్లో పూర్తిచేయాల్సి ఉంటుందన్నారు. సీపీవో గణేష్ కృష్ణ, జెడ్పి డిప్యూటీ సీఈవో ఆనంద్ కుమార్, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా సమన్వయకర్త కె.రవికాంత్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ నగర సమగ్రాభివృద్ధికి సత్వర డీపీఆర్‌లు

(మొదటిపేజీ తరువాయి)

గురువారం కలెక్టరేట్‌లో ఎంపీ కేశినేని శివనాథ్.. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సీపీ ఎస్వీ రాజశేఖరబాబుతో కలిసి రహదారులు, భవనాలుబీ విజయవాడ నగర పాలక సంస్థ, రెవెన్యూ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. విజయవాడ తూర్పు, పశ్చిమ, మధ్య నియోజకవర్గాల పరిధిలో భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. మహానాడు రోడ్డు నుంచి నిడమానూరువరకు ఫ్లైఓవర్‌తో పాటు తొలిదశలో గన్నవరం నుంచి మెట్రో కారిడార్ పనులు పూర్తయితే విజయవాడ మరింత శరవేగంగా అభివృద్ధి పథంలో పయనించనున్న నేపథ్యంలో ఆ పనులు పూర్తయ్యేలోపు ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా అభివృద్ధి చేయాల్సిన ప్రత్యామ్నాయ మార్గాలపై మ్యాపుల ఆధారంగా చర్చించారు. భవిష్యత్తులో ఎలాంటి ట్రాఫిక్ సమస్య ఎదురుకాకుండా ఏర్పాటు చేయాల్సిన పార్కింగ్ స్థలాలు, వంతెనలు, జంక్షన్ల అభివృద్ధి, ప్రత్యామ్నాయ రహదారులు, రహదారుల అనుసంధానం తదితరాలపైనా చర్చించారు. రివర్ బండ్ సుందరీకరణ, హిల్స్ రెయిలింగ్, కాళేశ్వరరావు మార్కెట్ జంక్షన్ సుందరీకరణ, గాంధీ హిల్ అభివృద్ధి, కేదారేశ్వరరావుపేట-టన్నెల్ రహదారి విస్తరణ, చిట్టినగర్ జంక్షన్ సుందరీకరణ, వాటర్ ఫౌంటెయిన్‌తో సితార జంక్షన్ సుందరీకరణ, టన్నెల్-గొల్లపూడి 200 అడుగుల రహదారి సుందరీకరణ, కృష్ణలంక కట్ట సుందరీకరణ, వాక్‌వేలు తదితరాలపై సమావేశంలో చర్చించారు. ఈ అంశాలకు సంబంధించి సాధ్యాసాధ్యాలను పరిశీలించి.. యుద్ధ ప్రాతిపదికన ప్రతిపాదనలు, అంచనాలు, డీపీఆర్‌లు సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అర్బన్ డెవలప్‌మెంట్ ఫండ్ (యూడీఎఫ్), పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ (పీపీపీ) ప్రాజెక్టుల ద్వారా నగర అభివృద్ధికి



తీసుకోవాల్సిన సత్వర చర్యలపై సమావేశంలో చర్చించారు.

**పార్కుల అభివృద్ధి కీలకం**

నగర ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు వీలుగా ఉన్న పార్కులను అభివృద్ధి చేయడంతో పాటు కొత్త పార్కులనూ అందుబాటులోకి తేవాల్సిన అవసరముందని సమావేశంలో పేర్కొన్నారు. కెనాల్ వెంబడి చిన్నచిన్న పార్కులను అభివృద్ధి చేసి, హరితమయ వాతావరణంలో చిన్న ఫుడ్‌కోర్టులు ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. విపత్తు నిర్వహణ ప్రణాళికలో భాగంగా మూడు నియోజకవర్గాల పరిధిలో సైక్లోన్ సెంటర్ల ఏర్పాటుపైనా సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, వీఎంసీ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రాజెక్టులు) సి.సత్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తుకు భరోసా కల్పించడమే రైతుకిచ్చే నిజమైన గౌరవం

(మొదటిపేజీ తరువాయి)

కృష్ణాజిల్లాలో ఇంకా 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని అలానే గన్నవరం నియోజకవర్గంలో దాదాపు 15 వేల ఎకరాలలో 44 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణ చేయాల్సి ఉందన్నారు. సివిల్ సప్లై శాఖ వారు ఈ సమస్యలపై దృష్టి సారించి రైతుల ధ్యానం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖకు పలు సూచనలు చేశారు. జిల్లా పిపిసి కోటాను డివిజన్ వారీగా వరి పంట ప్రాంతాల ఆధారంగా విభజించాలని మిగిలిపోయిన కుప్పలు, ఆలస్యంగా పంట కోసిన ప్రాంతాలను వరి సేకరణ కోసం పరిగణించాలని సూచించారు. కలెక్టర్లు ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర, ఊహించని పరిస్థితులలో వరిని సేకరించడానికి ఎటువంటి పరిమితులు లేకుండా బాధిత రైతులకు సహాయం చేయడాని ప్రత్యేక అధికారాలు జారీ చేయాలని కోరారు. వైసీపీ హయాంలో సనాతన ధర్మం పై, ఆలయాల పై దాడులు. 2019-24 వైసీపీ ప్రభుత్వ హయాంలో సనాతన ధర్మం పై, ఆలయాల పై దాడులు జరిగాయని గుర్తు చేశారు. అంతర్వేదిలో నరసింహస్వామి వారి రథాన్ని దగ్ధం చేసిన ఘటన, రామతీర్థంలో రాముల వారి విగ్రహం ధ్వంసం చేసిన ఘటన, విజయవాడ దుర్గమ్మ ఆలయంలో వెండి రథం దొంగిలించిన ఘటన, శ్రీశైలం లో కుంభాభిషేకం జరగకుండా ఆపేసిన ఘటనలు, కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి లడ్డు ప్రసాదాన్ని కల్తీ చేసిన ఘటనలు జగన్ హయాంలో జరిగాయని గుర్తు చేశారు. గత ప్రభుత్వం అధర్మ పనులు చేసి అపకీర్తిని మూట కట్టుకుందని చెప్పారు. తాను అమ్మవారి ఆలయంలో వెండి పల్లకి సమర్పిస్తే అది, ఉందో లేదో తెలుసుకోవడానికి తనకు రెండు నెలల సమయం పట్టిందని చెప్పారు. రాష్ట్రంలో జగన్ సీఎం గా ఉన్నపుడు ఎన్ని అక్రమాలు దేవాదాయశాఖ లో జరిగినా ఏనాడు క్షేత్ర స్థాయి కి ఆయన వెళ్లి పరిశీలించ లేదనీ.. నివారణకి చర్యలు చేపట్టలేదని మండిపడ్డారు. తిరుమల లో స్వామి వారు మీద విశ్వాసం ఉంచి సెల్ఫ్ డిక్లరేషన్ మీద కూడా వైఎస్ జగన్ ఏనాడు సంతకం చేయలేదని అన్నారు. రాజకీయాలల్లో ఉన్న వాళ్ళు అన్నీ మతాలను, ధర్మాలను గౌరవిస్తూ సమ దృష్టితో చూడాల్సిన అవసరం ఉందన్నారు. తమరు కూడా అప్పట్లో ఈ విషయాలు ప్రశ్నించారని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుకు గుర్తు చేశారు. గన్నవరం నియోజకవర్గం లోని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నడిచే ఆలయాల అభివృద్ధి, సంరక్షణ కు నిధులు కేటాయించాలని సంబధిత మంత్రి ని కోరారు. తన స్వగ్రామం పెనుమత్స లో 500 సంవత్సరాల పురాతనమైన శైవక్షేత్రం ఉందని ఈ ఆలయం శిల్ప శైలి మొత్తం చోళుల కాలం నాటిదని దేవాదాయ శాఖ అధికారి స్టపతి నిర్ధారించారని చెప్పారు. ఈ శివాలయాన్ని పునర్ నిర్మాణం చేయాలని ఇందుకోసం ఇందుకోసం మూడున్నర కోట్ల రూపాయిలు సీజీఎఫ్ నిధులు మంజూరు చేయాలని తాను పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా లెటర్‌లు కూడా పెట్టమని సభకు తెలిపారు.

గన్నవరం విమానాశ్రయం ఎదుట ఉన్న వెటర్నరీ కళాశాల ప్రహరికి మరమ్మత్తులు చేయాలి. బ్రిటిష్ కాలంలో వెటర్నరీ సిస్టం బ్రహ్మాండంగా ఉండేదని కానీ ప్రభుత్వాలు మారుతున్న కొద్ది ప్రాధాన్యత కోల్పోతుందని చెప్పారు. వెటర్నరి సిస్టం ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. రైతు సోదరులు పాడిపరిశ్రమ పై ఆధారపడతారని కానీ పశు వైద్యులు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తన నియోజకవర్గంలో గన్నవరం విమానాశ్రయం ఎదురుగా ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల ఉందని ఆ కళాశాల కళవిహీనంగా తయారైందని అందుకు ఆ కళాశాల ప్రహరీ గోడ సాక్ష్యమని చెప్పారు. మరమ్మతుల కోసం రూ.56



లక్షలు కేటాయించాలని కోరామని వాటిని మంజూరు చేయాలని కోరారు. విజయ డైరీ పై ఎంక్వయిరీ వెయ్యాలి. విశాఖ డైరీ తరహాలో విజయ డైరీ పై విచారణ చేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ కోరారు. గన్నవరం టీడీపీ కార్యాలయం పై దాడి చేసిన నిందితులే ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లగా, పార్లర్ ఓనర్స్ గా వ్యవహరిస్తున్నారని చెప్పారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుడు జగన్ అనే వ్యక్తికి ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్ట్ ఇచ్చారని ఆరోపించారు. విశాఖ డైరీ పై విచారణ జరిగిన తర్వాత ఉద్యోగులకు జీతాలు పెరిగాయని, పాల రేట్ కూడా పెంచారని చెప్పారు. విజయ డైరికి సంబంధించి వైసీపీ వారికే ఎక్కువ మిల్క్ బూత్ లు కేటాయించారని ఆరోపించారు. వీటిలో అవకతవకలు జరిగాయని చెప్పారు. విశాఖ డైరీ లానే విజయ డైరీ పై కూడా ఎంక్వరి చేయాలని సంబంధిత మంత్రి ని యార్లగడ్డ కోరారు.



## వేణుగోపాల స్వామి దర్శించుకున్న జనసేన నాయకులు

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వేకనూరు గ్రామంలో పునర్నిర్మాణం చేసిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయంలో ప్రతిష్ట మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. గురువారం జనసేన నాయకులు మండలి వెంకట్రామ్, గుడివాక శేషుబాబులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ, సిద్ధాంతి పాకలపాటి రామచంద్ర రావువ పర్యవేక్షణలో వేదపండితులు దీవి వెంకట రాఘవ ఫణి కృష్ణమాచార్యుల చే నూతన విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం శోభాయమానంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ మండల్ వెంకట్రాం గుడివాడ శేషుబాబులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గుడివాక రామాంజనేయులు, తుంగల సుధ, పార్టీ నాయకులు, కమిటీ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## తడి చెత్త పొడి చెత్త వేరు చేయాలి




**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** గ్రామస్తులు తడి చెత్త పొడి చెత్తను వేరుచేసి రిక్షా కార్మికులకు అందజేయాలని సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ సూచించారు. మండల పరిధిలోని పులిగడ్డ పంచాయతీ పరిధిలో సాయిబాబా గుడి వద్ద గురువారం సర్పంచ్ ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా శుభ్రం చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తడి చెత్త పొడి చెత్త వేరుచేసి పంచాయతీ రిక్షాలకు అందజేయాలని గ్రామంలో ఎక్కడబడితే అక్కడ చెత్త వెయ్యకుండా నిర్ణీత ప్రదేశాల్లోనే వేయాలని గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు గ్రామంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం ఉంటుందని ఆరోగ్యమే మహాభాగ్యం అని ప్రతి ఒక్కరూ గ్రహించాలి అన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ బి అనిత పంచాయితీ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కరువు మండలాల్లో పెంచిన ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోండి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పెంచిన ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకొని ఉపాధి హామీ కార్మికులు లబ్ధి పొందాలని, కృష్ణా జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ అన్నారు. ఎంజీఎన్ఆర్జీఎస్ ఉపాధి హామీ పథకం కింద పెంచిన ఉపాధి హామీ పనులను గురువారం కానూరు గ్రామంలో గోపు ప్రారంభించారు. ఈ ఉపాధి హామీ పనియందు 180 మంది పనిచేయుచున్నార న్నారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న తీరుతెన్నులను ఆయన సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు తీపికబురు చెప్పిందని కరువు మండలాల్లో ఉపాధి హామీ పని దినాలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారని తాజా నిర్ణయంతో పని దినాలు 150 రోజులకు పెరిగాయన్నారు. ఇప్పటికే 100 పని దినాలు వినియోగించుకున్న కరువు మండలాల్లోని కుటుంబాలు మార్చి నెలాఖరులోగా మిగతా 50 పనిదినాలు ఉపయోగించుకోవచ్చన్నారు. వెంటనే ఈ 50 అదనపు పని దినాలు అమలులోకి వస్తాయని అన్నారు. అంతేకాకుండా గతంలో రూ.270లు ఉన్న వేతనాన్ని కూటమి ప్రభుత్వం రూ.30లు పెంచి రూ.300లు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో దివి మహేష్, రాము, బొమ్మిడి ఏడుకొం డలు, వంకా కాశీ, కొక్కిలిగడ్డ ప్రభుదాస్, మోపిదేవి కృష్ణ పాల్గొన్నారు.

# నూతన క్రిమినల్ చట్టాలు -2023పై అవగాహన కోసం పోలీసు సిబ్బందికి శిక్షణ



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ఎన్.టి.ఆర్.జిల్లా పోలీసు కమిషనరేట్ పరిదిలోని పోలీసు సిబ్బంది అంధరూ పోలీసు విధులలో బాగంగా ప్రతి ఒక్క అంశంపై పూర్తి అవగాహన కలిగి నగర ప్రజలకు మెరుగైన సేవలను అంధించాలనే సదుద్దేశంతో నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు అడ్మిన్ డి.సి.పి. కె.జి.వి.సరిత పర్యవేక్షణలో సిటీ ట్రైనింగ్ సెంటర్ ఏ.సి.పి. బి.ఉమా మహేశ్వర రెడ్డి వారి సిబ్బందితో కలిసి నగరంలోని పోలీసు అదికారులు, సిబ్బందికి ప్రతి రోజూ ఏ.ఆర్.గ్రౌండ్ లోని సిటీ ట్రైనింగ్ సెంటర్‌లో వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఈ క్రమంలో 05-03-2025 నుండి 07-03-2025 తేదీలలో మూడు రోజులపాటు న్యూ క్రిమినల్ లా -2023 & ఇంపార్టెంట్ టు ఇన్వెస్టిగేషన్ ఎఫ్.ఐ.ఆర్. టు చార్జ్ షీట్ వరకు తీసుకోవాల్సిన చర్యల గురించి అన్నీ పోలీసు స్టేషన్ లోని 65 మంది సిబ్బందికి క్షుణ్ణంగా వివరించడం జరుగుతుంది. ఈ శిక్షణలో నేర స్థలంలో ఆదునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఏవిధంగా సాక్ష్యాలను సేకరించాలి అనే విషయంపై వివరించడం జరుగుతుంది. శిక్షణ అనంతరం సిబ్బందికి శిక్షణ ఇచ్చిన అంశంపై పరీక్ష నిర్వహించి శిక్షణ తీసుకున్న సిబ్బంది ఏవిధంగా పరిణీతి చెందారో గుర్తించడం జరుగుతుంది. అదేవిధంగా ఇప్పటివరకు ది.03-03-2025 తేదీన ఏ.సి.పి.లు కె.లతా కుమారి, స్రవంతి రాయ్ గార్ల ఆద్వర్యంలో ఉమెన్ హెల్ప్ డెస్క్ గురించి 39 మంది సిబ్బందికి పోలీసు స్టేషన్ కు వచ్చిన బాధిత మహిళలతో ఏవిధంగా వ్యవహరించాలి, వారికి ఏ విధంగా సహకరించాలి అనే విషయంపై శిక్షణ ఇవ్వడం జరిగింది. ది.04-03-2025 తేదీన ప్రతి సోమవారం పోలీసు కమిషనర్ వారి కార్యాలయంనందు నిర్వహించు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.) కు వచ్చిన ఫిర్యాదుదారులతో ఏవిధంగా వారి సమస్యను చట్ట పరిదిలో త్వరితగతిన పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి 50 సిబ్బందికి క్షుణ్ణంగా వివరించారు.

ఈ సంధర్భంగా అడ్మిన్ డి.సి.పి. మాట్లాడుతూ...... గత ఐదు సంవత్సరాల నుండి వివిద కారణాల చేత సిబ్బందికి ఆర్.సి.కోర్స్ లను నిర్వహించలేకపోయాము. ఇప్పుడు పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్.గారు ప్రత్యేక చొరవ తీసుకుని కమిషనరేట్ పరిదిలోని పోలీసు సిబ్బంది అంధరూ పోలీసు విధులలో బాగంగా ప్రతి ఒక్క అంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఈ శిక్షణలను ఇవ్వడం జరుగుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ శిక్షణ ఇచ్చే ప్రతి అంశాన్ని పూర్తిగా తెలుసుకోవాలని ఏవైనా అనుమానాలు ఉంటే వెంటనే అధికారులను అడిగి తెలుసుకుని నివృత్తి చేసుకుని పోలీసు స్టేషన్ కు వచ్చే బాధితులు/ ప్రజలకు మరుగైన సేవలు అందించాలని కోరారు.

# స్థలాన్ని కబ్జా చేసి, మా కుటుంబాన్ని రోడ్డున పడేశారు

### వికలాంగ యువకుడు మస్తాన్ వలీ ఆవేదన





**విజయవాడ మేజర్ న్యూస్ :** రామకృష్ణాపురంలో కబ్జాకు గురైన స్థలం వద్ద వికలాంగ బాధితుడు మస్తాన్ వలి విలేకరుల సమావేశాన్ని నిర్వహించి తనకు జరిగిన అన్యాయంపై కన్నీరు మున్నీరు అయ్యారు. ఈ సందర్భంగా వికలాంగ యువకుడు మస్తాన్ వలీ మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుండి తాము నివాసం ఉంటున్న స్థలాన్ని మాది అని కొందరు ఆక్రమించుకున్నారని వాపోయారు. అదేమని ప్రశ్నించిన తన పైన, తన తల్లి పైన, కుటుంబ సభ్యుల పైన దాడి చేశారని, న్యాయం కోసం తమ వెంట వచ్చిన మీడియా ప్రతినిధులపై రాళ్ల దాడికి దిగారని వాపోయారు.గత నెల 27వ తేదీన స్థలాన్ని ఆక్రమించి ఆ స్థలంలో రౌడీలను ఉంచి ప్రశ్నించిన తమపై దాడి చేశారని, కళ్ళల్లో కారం కొట్టి ఇబ్బంది పెట్టారన్నారు. ఇంటిలో ఉన్న సుమారు పది లక్షల రూపాయలు విలువ చేసే సామాగ్రిని రౌడీలతో బయటకు పడేసారని ఆరోపించారు.తమపై దాడిని పోలీసులకు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 20 రోజుల క్రితం తనకు ప్రమాదం జరిగిందని, కాలు తొలగించారని ఆ ప్రమాదానికి కారణం కూడా కబ్జాదారులే అన్న అనుమానం ఉందన్నారు.. తమకు న్యాయం చేయాలని, తమ స్థలాన్ని తమకు ఇప్పించాలని వేడుకున్నారు. ప్రభుత్వ పెద్దలు స్పందించాలని, పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తమకు చెందిన 280 గజాల స్థలాన్ని తమకు ఇప్పించాలని కోరారు. ఆస్తికి సంబంధించిన పూర్తి డాక్యుమెంట్స్ తమ వద్దే ఉన్నాయని స్పష్టం చేశారు తమపై దాడి చేసిన వారి నుంచి ప్రాణహాని ఉందని తమకు రక్షణ కల్పించాలని అలాగే వారిపై కఠినమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు.

# జిల్లా పరిషత్ హై స్కూల్‌కు చెందిన బాలికలతో ఓపెన్ హౌస్



**నందివాడ,మేజర్ న్యూస్:** జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్, ఆదేశాలపై గుడివాడ డిఎస్పీ ధీరజ్ వినీల్ మార్గదర్శకంలో, గుడివాడ రూరల్ ఇన్స్పెక్టర్ ఎస్-ఎల్ఆర్. సోమేశ్వర రావు ఆధ్వర్యంలో నందివాడ ఎస్సై శ్రీనివాస్ సమన్వయంతో నందివాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినిలతో మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా గురువారం పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎస్సై శ్రీనివాస్. ఈ కార్యక్రమం లో పోలీస్ స్టేషన్‌ను శుభ్రంగా, సక్రమంగా ఉంచి విద్యార్థులు, బాలికలు, మహిళలకు ఆత్మీయ స్వాగతం అందించి, సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించారు. కంట్రోల్ రూమ్, మహిళా సహాయ కేంద్రం, సైబర్ క్రైమ్ విభాగం వంటి ప్రధాన విభాగాలను చూపించారు. అత్యవసర ప్రతిస్పందన, ఎఫ్ఐఆర్ దాఖలు, డిజిటల్ భద్రత గురించి సంక్షిప్త అవగాహన సెషన్లు నిర్వహించారు. పోలీస్ వ్యవస్థ, మహిళా భద్రతా చర్యలు గురించి వివరణ ఇచ్చి మహిళా భద్రతా చర్యలు, ఆత్మరక్షణ, అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లను వివరించే బ్రోచర్లు, పోస్టర్లు చూపించి సదరు విద్యార్థిని ల సందేహాలను నివృత్తి చేసి భవిష్యత్తు కార్యక్రమాలను మెరుగుపరిచేందుకు పాల్గొన్న వారిచే అభిప్రాయాలు సేకరించి మహిళల హెల్ప్‌లైన్ నంబర్లు అందించి, భద్రతా కార్యక్రమాలలో విద్యార్థినులు పాలుపంచుకునేలా ప్రోత్సహించడం జరిగిందని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.



# తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరించండి

## కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** గృహాల నుండి తడి,పొడి, చెత్తను వేరువేరుగా సేకరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బాలాజీ నగర ప్రాంతాల్లోనే కాక గ్రామీణ ప్రాంతాల్లో కూడా విస్తృతంగా పర్యటిస్తూ పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. మచిలీపట్నం మండలం రుద్రవరం గ్రామంలో గురువారం ఉదయం స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా తడి,పొడి చెత్త వేరు చేసే విధానాన్ని కలెక్టర్ బాలాజీ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. శానిటేషన్ సిబ్బంది ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలన్నారు. తడి,పొడి చెత్త వేరువేరుగా ఇవ్వని యజమానులపై అవసరమైతే చర్యలు తీసుకునేందుకు కూడా వెనకాడ వద్దన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది సేకరించిన చెత్తను కుప్పగా పోసి తడి, పొడి చెత్తను ఎలా వేరు చేయాలో ప్రత్యక్షంగా చూపించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి రెండు బుట్టల్లో అందించాలని శానిటేషన్ సిబ్బందికి, సూచించి ప్రజలకు స్పష్టం చేయాలన్నారు. తడి చెత్తను స్థానికంగా ఉండే చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల (సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్) కు తరలించాలని, వర్మి కంపోస్ట్ తయారీ, అమ్మకాల ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు, పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని కలెక్టర్ బాలాజీ అన్నారు.

# జిఇ ఏరోస్పేస్ కు ఎంపికైన గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ విద్యార్థులు

## మెకానికల్ విద్యార్థులకు రూ.2 లక్షల వార్షిక కొలువులు

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీ (జిఈ) అనుబంధ సంస్థగా ఉన్న జిఇ ఏరోస్పేస్ ఫిబ్రవరి 28 న నిర్వహించిన ఆన్లైన్ ప్రాంగణ ఎంపికలలో గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ మెకానికల్ విద్యార్థులు పి.మహేష్, ఆర్.తనుష్, పి.ఐ.ఎస్.మెహర్, యు. సత్యనారాయణ లు వార్షిక వేతనం రూ.రెండు లక్షలతో కొలువులు సాధించడం జరిగింది.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎన్. రాజశేఖర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య, సైనిక, వ్యాపార, సాధారణ విమానాల కోసం జెట్, టర్బోప్రాప్ ఇంజిన్లను తయారు చేసే ప్రముఖ సంస్థ అని, అలాగే భారతదేశంలో, జిఇ ఏరోస్పేస్ 40 సంవత్సరాలకుపైగా విమానయాన రంగంలో కీలక పాత్ర పోషిస్తూ, 1982లో ఎయిర్ ఇండియా ఎయిర్బస్లో మొదటి సిఎఫ్6-50సి2 ఇంజిన్ ఇన్స్టాల్ చేయడం నుండి, 2024లో భారత నౌకాదళం యొక్క ఐఎన్ఎస్ విక్రాంత్ విమాన వాహక నౌకలో ఎల్ఎం2500 ఇంజిన్లు అందించడం వరకు భారతదేశంలో తన ప్రయాణాన్ని కొనసాగించిందని తెలియజేసారు. అలాగే భారతదేశంలో విమానయాన రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఈ సంస్థలో అతిపిన్న వయస్సులోనే మా విద్యార్థులు కొలువులు సాధించడం సంతోషంగా వుందని, అదేవిధంగా డిప్లొమా విద్యనభ్యసించే ప్రతి విద్యార్థి కూడా మీ యొక్క భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలంటే ఈ దశలోనే మీరు ఉద్యోగాలపై దృష్టి సారించాలని ఇందుకు విద్యార్థుల తల్లితండ్రులు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. కొలువులు సాధించిన మెకానికల్ విద్యార్థులు



పి.మహేష్, ఆర్.తనుష్, పి.ఐ.ఎస్.మెహర్, యు.సత్యనారాయణలను, ట్రైనింగ్ అండ్ ప్లేసెమెంట్స్ ఆఫీసర్, ఎలక్ట్రికల్ విభాగాధిపతి ఎమ్.వినయ్, మెకానికల్ విభాగాధిపతి ఎస్.సురేష్ను, విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించిన అధ్యాపకులను యాజమాన్య సభ్యులు చైర్మన్ డా.వల్లూరుపల్లి నాగేశ్వర రావు హ, సెక్రటరీ & కరెస్పాండెంట్ వల్లూరుపల్లి సత్యనారాయణ రావు, కో - సెక్రటరీ & కరెస్పాండెంట్ వల్లూరుపల్లి రామకృష్ణ, ప్రిన్సిపాల్ రాజశేఖర్ అభినందించారు.



## బోడే కుమారుని రిసెప్షన్ వేడుకల్లో పాల్గొన్న వర్ల

**పామర్రు మార్చి 6 మేజర్ న్యూస్ :** విజయవాడ కానూరులోని వి.ఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో జరిగిన పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడే ప్రసాద్ కుమారుని రిసెప్షన్ వేడుకలలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి సహచర శాసనసభ్యులు బోడే ప్రసాద్కు శుభాకాంక్షలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు జనసేన పామర్రు నియోజకవర్గ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్, తెలుగుదేశంకి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహనీయులు బోధనలు ప్రపంచానికి ఆదర్శం



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** పవిత్ర రంజాన్ మాసం ఐదవ రోజున అజ్మీర్ షరీఫ్ లో వేంచేసి ఉన్నసూఫీ మహనీయులు హుజూర్ హజరత్ ఖ్వాజా మొయినుద్దీన్ చిష్టి వారి గురుదేవులు హుజూర్ హజరత్ ఖ్వాజా ఉస్మాన్ హారుని వారి ఉపదేశాలను, త్యాగాన్ని, సత్య జీవన విధానాన్ని గుర్తుచేస్తూ వారి బోధనలు ప్రపంచానికే ఆదర్శం అని ఆస్థాన అతా ఏ బాగ్ ఏ సర్కార్ తాజుల్ ఔలియా దర్బార్ జంపని లో సజ్జాదా అల్ ఖాద్రియ అతా ముహమ్మద్ నిజాముద్దీన్ నిజామి షా తాజ్ ఖాదరీ అన్నారు. దర్బార్ లో గురువారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం నిజాం బాబా మాట్లాడుతూ హుజూర్ హజరత్ ఉస్మాన్ హారూని గొప్ప వ్యక్తి అంటే సత్య హృదయం తో నిండిన సంతృప్తి, నిజాయితీ, అన్నింటికంటే ముఖ్యంగా త్యాగం అనే గుణాలు కలిగిన మహనీయులు అన్నారు. అహంకారం ఒక శత్రువు అని ఒక మనిషి మానవులను ప్రేమించకపోతే, దేవుడిని ప్రేమించడం అసాధ్యం అన్నారు. ఉపవాస దీక్షను ఆచరించే వారికి ఐదవ రోజు ఇఫ్తార్ విందు, కుల, మత, జాతి, వర్గ భేదం లేకుండా అందరికి లంగర్ షరీఫ్ మహా దివ్య అన్న సమారాధన ఘనంగా నిర్వహించామన్నారు. రంజాన్ మాసం 30 రోజులు ఉపవాస దీక్ష లో ఉన్నవారితో పాటు కుల, మత, భేదం లేకుండా అందరికి అన్న సమారాధన దైవ కృపతో, సూఫీ మహనీయులు గురుదేవులు హజరత్ సూఫీ ఖ్వాజా ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బోగ్దాదీ బాబా చీమలపాడు వారి దివ్య ఆశీస్సులతో ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



## ఘనంగా అడ్డూరి శ్రీరామ్ జన్మదిన వేడుకలు

**నందిగామ, మార్చి 6, మేజర్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ నందిగామ కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు బిజెపి అడ్డూరి శ్రీరామ్ జన్మదిన మహోత్సవం సందర్భంగా కేక్ కటింగ్ ప్రోగ్రాం, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య, పట్టణ అధ్యక్షులు మునగంటి కామేశ్వరరావు, చిరుమామిళ్ల శ్రీనివాసరావు,గంటా వెంకట్రావు, ఊటుకూరి సత్యనారాయణ గుప్తా, తులసి కృష్ణ, కొత్త సాంబ శివరావు, బుర్ర వెంకట్రావు, గోనెల సత్యనారాయణ. కటుకూరు సుంద్రావు. వీసం రాఘవ, మురుమూరు శివ, రమేషు, అక్కి స్వామి, మల్లెల కృష్ణ, కొల్లిపర గోపాలకృష్ణ, థమకృష్ణ కుమారి, రాయల్ ఆదిలక్ష్మి, పబ్బతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సౌజన్యంతో కంటి పరీక్ష యంత్రం అందజేత



**నందిగామ, మార్చి 6, మేజర్ న్యూస్:** పట్టణంలోని దేవినేని వెంకటరమణ ఏరియా ప్రభుత్వ హాస్పిటల్లో కంటి కి సంబంధించి సుమారు లక్ష ఎనబది వేల రూపాయల ఆటో రిఫ్రీక్తో మీటర్ ట్రయిల్ బాక్స్ ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య సౌజన్యంతో చైర్మన్ వేపూరి నాగేశ్వరరావు సూపరిండెంట్ సత్యనారాయణ, సహాయ సహకారాలతో అభివృద్ధి కమిటీ చైర్మన్ వేపూరి నాగేశ్వరరావు కంటి విభాగం డాక్టర్స్ స్వప్నలత శేషు కుమారికి అందజేశారు. ఈ సదుపాయాన్ని నియోజకర్గ ప్రజలు చుట్టు పక్కల ప్రజలు వినియోగించుకో గలరని చైర్మన్ నాగేశ్వరరావు కోరారు.

## 72వ శ్రీరామ కోటి మహోత్సవాలు



**నందిగామ, మార్చి 6, మేజర్ న్యూస్:** పట్టణంలోని 72 వ శ్రీరామ కోటి మహోత్సవ కార్యక్రమంను నందిగామ మున్సిపల్ చైర్పర్సన్ మండవ కృష్ణ కుమారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. స్థానిక నందిగామ లోని శ్రీ సీతారామాంజనేయ స్వామి వారి దేవాలయంలో శ్రీ శృంగేరి శ్రీ విరూపాక్ష శ్రీ పీఠాధిపతులు జగద్గురు గంభీరానంద భారతి మహాస్వామితో కలిసి రామాలయంలో ఏర్పాటుచేసిన వివిధ పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఐదవ వార్డు కౌన్సిలర్ ఏచూరి రత్నకుమారి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిష్టాపన మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వేకనూరు గ్రామంలో కొలువై ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి ఆలయ పునర్నిర్మాణ మహోత్సవంలో మాజీ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం 11: 45 నిమిషాలకు పాకలపాటి రామచంద్రరావు సిద్ధాంతి పర్యవేక్షణలో దివి వెంకట రాఘవఫణి కృష్ణమాచార్యువ వేద పండితులచే నూతన విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం శోభయమానంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సింహాద్రి రమేష్ బాబును శాలువాతో సత్కరించి వేణుగోపాల స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 12న ఆరాధన మండపం బహిరంగ వేలం



**మొవ్వ (మార్చి 6) మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన మొవ్వ శ్రీ భీమేశ్వర స్వామి వారి ఆలయం వెనుక భాగములో నూతనంగా నిర్మించిన శ్రీ క్షేత్రయ్య ఆరాధన మండపం, విడిది ఇల్లు వివాహాది శుభకార్యములకు అద్దెకు ఇచ్చు హక్కు 3 సం.ల కాలపరిమితిగాను దేవాదాయ ధర్మాదాయ శాఖ చట్టం 30/87వద్ద సెక్షన్ 82, జీవో ఎంఎస్ నెంబర్:379/13-03-2003 ప్రకారం ముందస్తు నగదు చెల్లించి పద్ధతిన లీజుకిచ్చుటకు ఈనెల 12వ తేదీ బుధవారం సాయంత్రం 4 గంటలకు భీమేశ్వర స్వామి వారి ఆలయ ఆవరణలో కార్య నిర్వహణ అధికారిచే బహిరంగ వేలం నిర్వహించినట్లు కార్య నిర్వహణ అధికారి ఎస్. వి. సుబ్బారావు తెలిపారు. బహిరంగ వేలంలో పాల్గొని వారు 50,000/- ధరావత్ చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనాలని తెలిపారు. ఇతర వివరములకు కార్యనిర్వహణ అధికారిని సంప్రదించాలని తెలిపారు. మొవ్వ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి ధూప దీప నైవేద్య కైంకర్యాల కొరకు కేటాయించిన 7.89 సెంట్లు మాగాణి భూమిని బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్ఎస్ నంబర్ 378 లో4. 14,446/2-0.51,217/2-0.71,83/5-0.33,319/2-0.92,352/1-1.28 వెరసి 7.89 ఎకరాలు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. బహిరంగ వేలంలో పాల్గొని వారు ధరావతు చెల్లించి పాల్గొనాలని తెలిపారు. ఇతర వివరాలకు కార్యనిర్వహణ అధికారిని సంప్రదించాలని సుబ్బారావు తెలిపారు.

## పట్టభద్రులకు ప్రభుత్వంపై ఉన్న నమ్మకమే ఎమ్మెల్సీ అభ్యర్థుల ఘనవిజయం



**పెడన, మేజర్ న్యూస్ :** ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించడం పట్ల పట్టభద్రులకు కూటమి ప్రభుత్వంపై ఉన్న విశ్వాసమే ముఖ్య కారణం అని, అందువల్ల పట్టణ తెలుగుదేశం పార్టీ పట్టభద్రుల కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు అన్నారు. ఈ మేరకు పట్టణంలో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్య నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బొడ్డు మాట్లాడుతూ కూటమి పట్ల పట్టభద్రుల కు వున్న విశ్వసనీయతకు ఈ విజయం అద్దం పడుతుందని అన్నారు. మరో ఏడాదిలో మున్సిపల్ ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో అన్ని వార్డులలో టీడీపీ నాయకులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో బీసీ, ఎస్సీ లకు రుణాలు మంజూరుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్థానిక సచివాలయలకు అందేలా నాయకులు చూడాలని కోరారు.రాబోవు కాలంలో పార్టీ సంస్థాగత కమిటీలు అన్ని వార్డులలో,పట్టణ పరిధిలో జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు యక్కల శ్యామాలయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ ఖయ్యాం (హాన్ను), మాజీ కౌన్సిలర్లు ఇమ్మడి నాగ పోతారావు, బెజవాడ నాగరాజు, ప్రధాన కార్యదర్శి వహాబ్ ఖాన్, జితేంద్ర, కమ్మగంటి వెంకటేశ్వరరావు, వరుదు రామకృష్ణ, మట్టా నాని, వీణం శ్రీనివాస్, హామీదుల్ల, తదితర నాయకులు ఉన్నారు.

## 20 నాటికి 100% పన్నులు వసూలు చేయ్యవల్సందే



**రెడ్డిగూడెం, మేజర్ న్యూస్ :** రెడ్డిగూడెం మండల పరిషత్ కార్యాలయ మీటింగ్ హాల్‌లో రెడ్డిగూడెం మండలంలో అందరు పంచాయతీ కార్యదర్శులు, విస్తరణాధికారితో విజయవాడ డివిజనల్ పంచాయతీ అధికారి జి.వి.యన్.వి.రాఘవన్ ఇంటి పన్నులు వసూలు పై సమీక్ష సమావేశము గురువారం నిర్వహించారు. మండలంలో అన్ని గ్రామ పంచాయతీలలో ఇంటి పనులు, కుళాయి ఫీజులు, లైసెన్స్ ఫీజులు, సెల్ టవర్ ఫీజులు, చేపలపాటల సొమ్ములు మొదలగు అన్ని రకాల బకాయిలు 100% వసూలు చేయవలెనని ఆదేశించారు. 100% బకాయిలు వసూలు చేయని పంచాయతీ కార్యదర్శి లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆదేశించియున్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డిగూడెం మండల పంచాయతీ విస్తరణాధికారి పి.ప్రభాకర్ రావు, పంచాయతీ కార్యదర్శులు యస్. రామారావు, కే.టి రాజు, యం.భాస్కర రావు,యం.వెంకటేశ్వర్లు, డి.ఫణి శ్రీ, జి. యువ రాజు, బి.లక్ష్మీనారాయణ, సి.హెచ్. బుచ్చిబాబు, కె. రాజేష్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ స్థానాల్లో రొండి శ్రీకృష్ణ యాదవ్‌కి అవకాశం కల్పించండి.



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రొండి శ్రీకృష్ణ యాదవ్ అంటే ఉభయ ఉమ్మడి జిల్లాల్లోనూ మంచి పట్టున్న నాయకుడిగా పేరు ఉంది. ముఖ్యంగా యాదవ సామాజిక వర్గాన్ని ఒకే తాటిపైకి తెచ్చి తన సత్తా చాటిన ఏకైక నాయకుడు గా ఉభయ జిల్లాల్లో రొండి శ్రీకృష్ణ యాదవ్ పేరుపొందారు. అలాంటి ఖ్యాతి పొందిన నాయకుడు ఎమ్మెల్సీ స్థానానికి అన్ని అర్హతలు ఉన్న వ్యక్తేనని, వారి సామాజిక వర్గ నేతలు, నాయకులు, కార్యకర్తలే కాక, ఇతర సామాజిక వర్గాల వారు కూడా 'రొండిని' మెండుగా అభిమానించి ప్రేమిస్తారనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.గతంలో వీరు కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా పనిచేసి పలువురి మెప్పు పొందారు. అందరితోనూ ప్రేమగా, చెరగని చిరునవ్వుతో, మిత స్మిత భాషనుడిగా గుర్తింపు పొందిన రొండి శ్రీకృష్ణ యాదవ్ ఏనాడు పదవులకై వెంపర్లాడలేదు. వీరిలోని వ్యక్తిత్వాన్ని, గంభీరతను, మృదుస్వభావాన్ని, అందరిని కలుపుకుపోయే మనస్తత్వాన్ని గుర్తించి పదవులే వీరిని వరించాయి అని సన్నిహితుల ఉవాచ. నిండైన, మెండైన సేవాగుణం ఉన్న నాయకుడిగా రొండికి ఉభయ జిల్లాలో మంచి పేరు ప్రతిష్టలే ఉన్నాయి.2024 మే 13న జరిగిన ఎన్నికలలో ఏ రాజకీయ పార్టీ కూడా యాదవులను ప్రత్యేకంగా గుర్తించలేదని ఒక ముద్ర పడిపోయింది. కృష్ణాజిల్లా యాదవులంతా ఒకే తాటి పైకి వచ్చి కూటమి కి మద్దతు తెలపడంలో ముఖ్య భూమిక పోషించిన వ్యక్తిగా రొండి కృష్ణ యాదవ్ చిరస్థాయిగా మిగిలిపోతారనడంలో ఏమాత్రం సందేహం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం రొండిని, మెండుగా అభిమానిస్తారని యాదవ నాయకుల నమ్మకం. విశ్వాసం.అంతేగాక మంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరిల అండదండలు వీరికి మెండుగానే ఉన్నాయి. గత ఎన్నికలలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో కూటమి అభ్యర్థులను గెలిపించడంలో ' ప్రచారం చేసి కూటమి అభ్యర్థుల గెలుపుకు బంగారు బాటలు వేశారనడంలో అతిశయోక్తి లేదు. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ముఖ్య నాయకులందరితోనూ,వీరికి సత్సంబంధాలున్నాయి. పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరితో, రొండికి మంచి సాన్నిహిత్యమే ఉంది. జనసేన యాదవ సోదరులకు కూడా వీరి మాటే వేదవాక్కు.రొండి శ్రీకృష్ణ యాదవ్ కి తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీలో విస్తృత గుర్తింపు ఉంది.పేదలకు, అనాధలకు, అన్నార్తులకు, ఆపన్న హస్తం అందించే సహృదయ మూర్తి అని దండిగా పేరు గడించిన నిండైన, మెండైన వ్యక్తి ' రొండి'. అలాంటి రొండి కృష్ణ యాదవ్ కు తెలుగుదేశం పార్టీలో ఖాళీ అయిన మూడు యాదవ ఎమ్మెల్సీ స్థానాల్లో, ఒక్క ఎమ్మెల్సీ స్థానాన్ని వారికి ఇచ్చి 'రొండి కృష్ణ యాదవ్ కు నిండైన న్యాయం చేయాలని, వారు మెండైన సేవలు అందిస్తారని, ఉభయ జిల్లాలలోని యాదవులంతా ముక్తకంఠంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను, అభ్యర్థిస్తున్నారు. రొండి శ్రీకృష్ణ యాదవ్‌కు ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును యాదవులంతా అభ్యర్థిస్తున్నారు. మరి ఆ మేరకు రాబోయే ఎమ్మెల్సీ స్థానాల్లో రొండికి సమన్యాయం చేస్తారని యాదవ సోదరులు అందరూ ఆశగా ఎదురుచూస్తున్నారు. మరి వారి ఆశలు నెరవేరుతాయని ఆశిద్దాం.

## కొత్త వ్యాధులకు ఆధునిక టెక్నాలజీతో ప్రభావవంతమైన ఔషధాలు రూపొందించాలి



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** స్థానిక గుడ్లవల్లేరు వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్సెస్ కళాశాలలో ఈరోజు అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెషనల్స్ అనుసంధానంగా అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ రాజీవ్ దహియా ప్రెసిడెంట్ ఏపీపీ, గౌరవ అతిథి డాక్టర్ సి.వి సురేష్, వైస్ ప్రెసిడెంట్ ఏపీపీ విచ్చేశారు. ఈ సదస్సుకు కన్వీనర్ గా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ లక్ష్మణరావు, రిసోర్స్ పర్సన్ గా ప్రొఫెసర్ కే ఎన్ వి రావు ప్రిన్సిపాల్, నలంద ఫార్మసీ కళాశాల వ్యవహరించారు. ఈ కార్యక్రమం సాంప్రదాయంగా పి. తన్మయి స్వాగతం నృత్యంతో., కె. మైత్రి ప్రార్థన గీతంతో ఆరంభించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ సదస్సు ఔషధ శాస్త్రలలో ఔషధ రూపకల్పన యొక్క భవిష్యత్తు అవకాశాలు అనే అంశంపై నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యఅతిథి ప్రొఫెసర్ రాజీవ్ దహియా మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సంక్రమించే కొత్త వ్యాధులకు గణనీయమైన వైద్య అవసరాలు ఉన్నాయని ఔషధ రూపకల్పనలో ఆధునిక టెక్నాలజీని వినియోగించి త్వరితంగా, ప్రభావవంతమైన ఔషధాలను రూపొందించాలని కోరారు. గౌరవ అతిథి డాక్టర్ సివి సురేష్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఫార్మసిస్ట్ ప్రాధాన్యత ఎంతైనా ఉందని విద్యార్థులంతా నిబద్ధతో క్రమశిక్షణతో కూడిన కృషిని అలవర్చుకొని విజయమే ప్రధానంగా నడవాలని కోరారు. రిసోర్స్ పర్సన్ కే ఎన్ వి రావు. సదస్సు ముఖ్యాంశంపై గెస్ట్ లెక్చర్‌ను అందించారు. వేదిక పెద్దల చేతుల మీదగా అబ్స్ట్రాక్స్ రూపొందించిన సోవనీర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెషనల్ వారు అధ్యాపకులు, విద్యార్థులకు ఉత్తమ అధ్యాపకుడు, ఉత్తమ విద్యార్థి, ఉత్తమ పరిశోధకులు అవార్డులను అందించారు. మధ్యాహ్నం వివిధ కళాశాల నుండి విచ్చేసిన విద్యార్థులు, పరిశోధకులు ఈ పోస్టర్, ఓరల్ ప్రజెంటేషన్ ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రశంసా పత్రంతో పాటు మెమెంటో బహుకరించి ప్రోత్సహించారు. ఈ సదస్సుకు విచ్చేసిన అతిథులందరినీ మెమెంటోలు బహుకరించి సత్కరించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపల్ ఏ.లక్ష్మణరావుతో పాటు సదస్సు కోఆర్డినేటర్ డాక్టర్ పి రవీశ అధ్యాపకులు డాక్టర్ టి ప్రశాంతి, డాక్టర్ టి బాలకృష్ణ, బి సత్య శ్రీ, టి శ్రావణి, వి యల్ వినోద్ కుమార్, డాక్టర్ ఏ సాయిధాత్రి, డాక్టర్ వి రజిని తదితరులు పాల్గొన్నారు.

# సున్నపురాయి త్రవ్వకాల వలన భూగర్భ జలాలు అంతరించిపోతున్నాయి




**జగ్గయ్యపేట మార్చి 6 మేజర్ న్యూస్ :** పట్టణంలో కామ్రేడ్ పిల్లలమర్రి భవన్ సిపిఐ పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం గురువారం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశంలో యన్.టి.ఆర్ జిల్లా కార్యదర్శి దోనెపూడి శంకర్ మాట్లాడుతూ పారిశ్రామిక కేంద్రంగా ఈ ప్రాంతంలో సున్నపురాయి, గ్రానెట్, కంకర్ నిక్షేపాల త్రవ్వకాల గనులు ఉన్నాయి. సున్నపురాయి త్రవ్వకాలను రాంకో, కెసిపి,అల్ట్రా టెక్,హేమాద్రి సిమెంట్ కర్మాగారాలు ప్రభుత్వ అనుమతులతో త్రవ్వకాల చేపడుతున్నాయి. రామచంద్రునిపేట, అనుమంచిపల్లి గ్రామంలో గ్రానైట్,చిల్లకల్లు గ్రామంలో కంకర్ త్రవ్వకాల కోసం ప్రభుత్వ అనుమతులు తీసుకోవడం జరుగుతుంది. ఈ కర్మాగారాలలో కాంట్రాక్టు కార్మికులను కొంతమంది పేర్ల మీద శ్రమ దోపిడి చేయడం దారుణమని తెలియజేశారు. వీరికి ఎటువంటి రక్షణ పరికరాలు, పియఫ్, ఇయస్ఐ ఎంత మందికి ఉన్నాయో ప్రభుత్వం దగ్గర లెక్కలున్నాయా అని ఆయన తెలియజేశారు. రాంకో సిమెంట్ సున్నపురాయి అదనపు గనుల త్రవ్వకాల కోసం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో వారి సొంత మనుషులే జిల్లా కలెక్టర్ సమక్షంలో మాట్లాడారన్నారు.ప్రజలకు చేసేది గోరంత ప్రచారం మాత్రం కొండంత అన్ని తెలియజేశారు.రాంకో సిమెంట్ కర్మాగారం వారు పరిమితికి మించి సున్నపురాయి త్రవ్వకాలు చేపట్టడంతో పాలేరు వాగులోని జలాలు, చుట్టు ప్రక్కల భూగర్భ జలాలు సున్నపురాయి త్రవ్వకాలలో లోతైన గుంతలలో నీళ్ళు నిల్వ అవ్వడంతో చుట్టు పక్కల భూగర్భ జలాలు అంతరించి పోతున్నాయి.మితిమీరి సున్నపురాయి, గనుల త్రవ్వకాల పై ప్రభుత్వం అదనపు రాయల్టీ ని పెనాల్టీ గా విదిస్తుందే తప్ప పర్యావరణాని ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు.రాంకో సిమెంట్, ఇతర కర్మాగారాల వారు వారి చుట్టు పక్కల గ్రామాలలో ఆయా కర్మాగారాల పేరుతో పేద వారి కోసం కాలనీలను, పట్టణంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ని ఏర్పాటు చేయాలని ఆయన హితవు పలికారు.ఇప్పటికైన స్థానిక నాయకులు కర్మాగారలలో కాంట్రాక్టుల మీద దృష్టి కన్న పర్యావరణ పరిరక్షణ పట్ల శ్రద్ధ పెడితే ప్రజల ఆరోగ్యాలు మెరుగు పడుతాయన్నారు. నియోజకవర్గంలో రైతుల కోసం వేదాద్రి ఎత్తిపోతల పథకానికి ప్రత్యేక నిధులను ప్రభుత్వం ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన అన్నారు. గ్రామాలలో మూడు సెంట్లు,పట్టణానికి రెండు సెంట్ల భూమిని అర్హులైన పేదలకు వెంటనే అందించాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బుట్టి రాయప్ప, జిల్లా చేతివృదారుల సంఘం అధ్యక్షులు తాడి పైడయ్య, జిల్లా నాయకులు కొట్టు రమణారావు,ఏఐవైయఫ్ జిల్లా అధ్యక్షులు కరిసే మధు, నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి పోతుపాక వెంకటేశ్వర్లు, నియోజకవర్గ సహాయా కార్యదర్శి కె.బాబురావు, పట్టణ సహాయ కార్యదర్శి మాశెట్టి రమేష్, షేక్ అసదుల్లా, భోగ్యం నాగులు, మెటికల శ్రీనివాసరావు, షేక్ జాని, మస్తాన్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబం తడి,పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలి



రెడ్డిగూడెం, మార్చి 6, మేజర్ న్యూస్ : మండలంలోని అన్ని కుటుంబాలు గ్రామ పంచాయతీలో పని చేసే క్లాప్ మిత్రులకు తడి చెత్త,పొడి చెత్త వేరు చేసి ఇస్తేనే తడి చెత్త పొడి చెత్త సేకరణ సాధ్యమవుతుంది. డి ఎల్ పి ఓ, జి వి ఎన్ వి రాఘవన్ అన్నారు. ఇలా సేకరించిన తడి చెత్త పొడి చెత్తను క్లాప్ మిత్రాలు ఎస్ డబ్ల్యు పి సి షెడ్డునకు తరలించి సెకండ్ సేగ్రిగేషన్ చేసి పొడి చెత్తను సపరేట్ గా చేసి సేల్ చేసుకోవాలి. తడి చెత్త ను నాడెప్ పిట్స్‌లో వేసి వానపాముల ద్వారా వర్మి కంపోస్ట్ ఎరువు తయారు చేసి రైతులకు అమ్ముకాలు చేసుకోవాలి. ఈ విధంగా అమ్మకాల ద్వారా ఆదాయంలో పొడి చెత్త ఆదాయంలో 25%, వర్మీ కంపోస్ట్ అమ్మకాల ఆదాయంలో 10% వాటా గ్రామ పంచాయతీలలో పని చేసే క్లాప్ మిత్రాలకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించియున్నారు. అనంతరం రెడ్డిగూడెం గ్రామపంచాయతీలో గల సంపద తయారీ కేంద్రమును సందర్శించి షెడ్డు దగ్గర గల తడి పొడి చెత్తను క్లాప్ మిత్రాలు సెకండ్ సెగ్రిగేషన్ చేస్తున్న విధానమును పరిశీలించి ఇంకా మెరుగ్గా తడి చెత్తను సెగ్రిగేషన్ చేయడంలో క్లాత్ మిత్రాలకు, పంచాయతీ కార్యదర్శులకు సూచనలు సలహాలు ఇచ్చారు. అదేవిధంగా గ్రామాలలో చెత్త సేకరణ జరుగుతున్న సందర్భంలో ప్రతి గ్రామంలో దోమలు పెరుగుతున్న నేపథ్యంలో రెడ్డిగూడెం మండలంలో 12 పంచాయితీలను 2 గ్రామ పంచాయతీలను ఒక క్లస్టర్‌గా చేసి క్లస్టర్స్ వారీగా సాయంత్రం 05.30 నుంచి 06.30 సమయంలో (డంగ్ & డస్క్ సమయం అనగా దోమలు ప్రబలే సమయం) ఫాగింగ్ (పొగ మందు) చేయించాలి. దోమలు లార్వా స్టేజ్ లో ఉంటే మాలతిన్, ఎబెట్ స్ప్రే చేయించాలి. వెట్ పైపులకు దోమ తెరలు ఏర్పాటు చేయాలి. నీరు నిల్వ ప్రాంతాలలో ఆయిల్ బాల్స్ వేయాలి. ఈ విధంగా చేసినట్లయితే దోమలను రాబోయే రోజులలో పూర్తిగా నిర్మూలించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి పి.ప్రభాకర్ రావు, రెడ్డిగూడెం సెక్రటరీ ఎస్ రామారావు, మండలంలో గల అన్ని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బీసీ చైతన్య సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలుగా పోలంపల్లి రాధా



జగ్గయ్యపేట మార్చి 6 మేజర్ న్యూస్ : పట్టణానికి చెందిన పోలంపల్లి రాధమ్మ, షేక్ మునిరా బేగంలు నూతనంగా రాష్ట్ర బీసీ చైతన్య సంక్షేమ సంఘ మహిళా అధ్యక్షురాలు, జిల్లా బీసీ చైతన్య సంక్షేమ సంఘం అధ్యక్షురాలుగా ఎన్నిక కావడంతో వారిని జగ్గయ్యపేట నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని, స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం

### రాష్ట్ర, జిల్లా మహిళా అధ్యక్షులను అభినందించిన తన్నీరు నాగేశ్వరావు

ఇటీవల కాలంలో నూతనంగా ఎన్నికైన రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ మహిళా అధ్యక్షురాలు పోలంపల్లి రాధమ్మకి, జిల్లా బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షురాలు షేక్ మునిరా బేగంలను శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛంతో అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తన్నీరు మాట్లాడుతూ బీసీ అంటే బ్యాక్ వార్డ్ క్లాస్ కాదు బీసీ అంటే బ్యాక్ బోన్ క్లాస్ అని పరిపాలన అందించిన నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని, మన ప్రభుత్వంలో బీసీలకి వెన్ను దండగా ఉందని, మళ్లీ బీసీలంతా ఏకమై పార్టీకి అండగా నిలబడి పార్టీ గెలుపుకు కష్టపడి పనిచేసే పూర్వవైభవం తీసుకొని రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వేముల మల్లేశ్వర రావు, మాతంగి నాగబాబు, పట్టణ పార్టీ అధ్యక్షులు వట్టెం మనోహర్, మండల పార్టీ అధ్యక్షుడు బుడిద నర్సింహారావు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, న్యాయవాదులు సత్య శ్రీనివాసరావు, శివరాత్రి పృధ్వి, గొల్లపాటి బుల్లయ్య, ధారావత్ శ్యామల, గుంజ ఆశీర్వాదం, పట్టణ యువజన విభాగా ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ళ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం కోసం

# తెలుగుదేశం కృషి



రెడ్డిగూడెం, మార్చి 6, మేజర్ న్యూస్: దేశంలోనే తొలిసారిగా 44వేల ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లు నిర్వహించి పాఠశాలల్లోని సమస్యలపై చర్చించిన ఘనత టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కే దక్కుతుందనీ మండల టిడిపి అధ్యక్షుడు ముప్పిడి నాగేశ్వర్ రెడ్డి అన్నారు.. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం అయిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. ముఖ్యమైన పథకాలకు ప్రముఖ విద్యావేత్త డా? సర్వేపల్లి రాధాకృష్ణన్, సామాజిక కార్యకర్త డొక్కా సీతమ్మ పేర్లు పెట్టారు.అని. రాజకీయ పార్టీల రంగులు, నేతల బొమ్మలు లేకుండా 1 నుంచి 12 తరగతుల విద్యార్థులకు పాఠశాలల పునఃప్రారంభం రోజునే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ అందించనున్నారు. విద్యార్థులకు పుస్తకాల మోత లేకుండా వచ్చే విద్యా సంవత్సరం నుంచి సెమిస్టర్ వారీగా ఒకే పాఠ్యపుస్తకం కాన్సెప్ట్ ను అమలుచేయనున్నారనీ మధ్యాహ్న భోజన పథకంలో సన్న బియ్యం వినియోగించనున్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికల్లా 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నారనీ. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చి విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు మెరుగైన విద్యను అందించేందుకు నారా లోకేష్ చేస్తున్న కృషి హర్షించదగ్గ విషయం అని ఆయన అన్నారు.. తల్లికి వందన కార్యక్రమం కూడా ఈ ఏడాది మే నెలలో సూపర్ సిక్స్ పథకాలలో ఇచ్చిన హామీని ఈ ప్రభుత్వం అమలు చేయనున్నట్లు ఆయన అన్నారు.. విద్యావ్యవస్థ పలోపేతం కోసం పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ఈ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆయన తెలిపారు.

### ఘనంగా శ్రీ భద్రావతి సమేత భావనాఋషి కళ్యాణం



ఘంటసాల, మేజర్ న్యూస్: మండల కేంద్రమైన ఘంటసాల గోటకంలో పద్మశాలీ సంఘ కుటుంబ సభ్యుల, సంఘ పెద్దల ఆధ్వర్యంలో విఘ్నేశుని పూజ గాయత్రి హోమముతో శ్రీ భద్రావతి సమేత భావనాఋషి వార్ల 35వ వార్షిక కళ్యాణం గురువారం ఘనంగా నిర్వహించారు, ఈ కళ్యాణానికి పీటలపై రావిరాల శ్రీనివాసరావు హేమలత కూర్చోగా వేద పండితులు ఆకురాతి పాపారావు వేదమంత్రోచరణతో స్వామివారి కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. 2వ రోజు శ్రీ భద్రావతి సమేత భావనాఋషి వార్ల ఊరేగింపు 3 వ రోజు రాత్రి పద్మశాలీ సంఘ కుటుంబ సభ్యుల అన్న సమారాధన జరుగునని కమిటీ పెద్దలు తుమ్మలచర్ల మురళీకృష్ణ తదితర సభ్యులు పేర్కొన్నారు. ఈ 3 రోజులు ఎంతో కన్నుల పండుగగా సంఘ కుటుంబ సభ్యుల సహకారములతో ప్రతి సంవత్సరము నిరాటంకముగా జరుగుచున్నదని పేర్కొన్నారు స్వామి వారి రథం ఊరేగింపు, పద్మశాలీ కుటుంబ అన్న సమారాధన ఎంత వైభవంగా జరుగుతుందని తెలిపారు.. ప్రతి ఒక్కరూ స్వామివారిని దర్శించుకుని ఆయన ఆశీస్సులు పొందాలని కమిటీ వారి కోరారు.శ్రీ భద్రావతి సమేత భావనాఋషి స్వామి కమిటీ సభ్యులు తుమ్మలచెర్ల మురళీకృష్ణ, ఆకురాతి సుబ్రమణ్యేశ్వరరావు, ఆకురాతి నాగేంద్ర, తిరందాసు పవన్, నందం పాండు రంగారావు, భక్తులు విరివిగా పాల్గొని స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.

### పోలీస్ చట్టాల పట్ల బాలికలకు అవగాహన



ఎ.కొండూరు, మేజర్ న్యూస్: ఉమెన్ ఎంపవర్మెంట్ వీక్ కార్యక్రమంలో భాగంగా ఎ.కొండూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన బాలికలకు ఎస్ ఐ చల్లా కృష్ణ పోలీస్ చట్టాల పట్ల అవగాహన కల్పించారు. గురువారం ఎ.కొండూరు పోలీస్ స్టేషన్ లో స్టేషన్ హౌస్ ఓపెనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీబీవీ బాలికలకు పోలీస్ స్టేషన్ లో రికార్డుల గురించి, సీసీ కెమెరాలు గురించి, లాకప్ రూమ్ లు, విహెచ్ఎఫ్ సెట్ వాడకం గురించి, ఉమెన్ హెల్ప్ డెస్క్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కేజీబీవీ విద్యాలయం బాలికలు పాల్గొన్నారు.

### పెనుమత్సలో పలు కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



పమిడిముక్కల మేజర్ న్యూస్ : పమిడిముక్కల మండలం పెనుమత్స గ్రామంలో ఇటీవల మృతి చెందిన వేరువేరు కుటుంబాల సభ్యులను పామర్రు శాసన సభ్యులు వర్ల కుమార్ రాజా పరామర్శించారు. పెనుమత్స గ్రామానికి చెందిన దండమూడి వెంకటరత్నం మనుమడు ఇటీవల గుండెపోటుతో అకాల మరణం చెందగా కుమార్ రాజా ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుని చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుని తాత వెంకటరత్నం, తండ్రి భద్రం, పరుచూరి రామ్మోహనరావు ఇతర కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. అలాగే గత నెలలో హఠాన్మరణం చెందిన దండమూడి నారాయణరావు కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన తాను విదేశీ పర్యటనలో ఉన్న కారణంగా వెంటనే రాలేకపోయానని అందువలన ఆలస్యమైనందుకు అన్యథా భావించవద్దని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు దండమూడి ప్రకాష్, కృష్ణాపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నాదెళ్ళ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

### సామాజిక బాధ్యతతో మెలగాలి

#### కెయూ ఉపకులపతి ఆచార్య కె రాంజీ



మచిలీపట్నం మేజర్ న్యూస్ : ప్రజలు ముఖ్యంగా యువత సామాజిక బాధ్యత తో వ్యవరించాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఆచార్య కూన రాంజీ హితవు పలికారు. తమ సొంత ఆస్తులు ఎంత జాగ్రత్త గా కాపాడుకుంటామో ప్రజలకు చెందిన ప్రభుత్వ ఆస్తులను అంతే జాగ్రత్తగా రక్షించుకోవాలని ఆయన పేర్కొన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యములో పర్యావరణ పరిరక్షణ పై ఏర్పాటు చేసిన అతిథి ఉపన్యాస కార్యక్రమం లో ఆయన ప్రారంభ ఉపన్యాసం చేశారు. కృష్ణా విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి, జాతీయ కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు ఆచార్య ఎస్. రామకృష్ణారావు పర్యావరణం లో చోటుచేసుకుంటున్న మార్పులు పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విశదీకరించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, డీన్ ఆచార్య వైకే సుందర కృష్ణ, పలువురు ఆచార్యులు, సహాయ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎస్ రామకృష్ణారావు ను ఉపకులపతి ఆచార్య కూన రాంజీ దుశ్శాలువతో సత్కరించారు.

### ముఖ మండపానికి రూ 50 వేల వితరణ



ఘంటసాల, మేజర్ న్యూస్ : మండల కేంద్రమైన ఘంటసాలలో వేంచేసి ఉన్న శ్రీ భద్రావతి సమేత భావనఋషి స్వామి వారి దేవాలయం ముఖమండపం స్టీల్ గ్రిల్ ఏర్పాటుకు రూ.50 వేలు విరాళం అందించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ అందే జగదీష్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ బెంగుళూరు వాస్తవ్యులు అందె లీల కృష్ణ, శారదా రాణి దంపతులు రూ.50వేలు విరాళంగా స్టీల్ గ్రిల్ నిమిత్తం ఇచ్చారన్నారు. ఈ విరాళం చైర్మన్ ఇంటివద్ద అందించినట్లు ఆయన తెలిపారు.

### విద్యార్థులతో పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమం




గుడివాడ, మేజర్ న్యూస్ : ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎజికె స్కూల్ విద్యార్థులు పాల్గొని పోలీస్ స్టేషన్ రిసెప్షన్ కౌంటర్, ఉమెన్ హెల్ప్ డెస్క్, స్టేషన్ రికార్డులు, పోలీస్ కమ్యూనికేషన్స్ వ్యవస్థల పనితీరును తెలుసుకున్నారు. ఎస్ఐ చంటి బాబు, మహిళా పోలీసులు దగ్గరుండి స్టేషన్లోని ప్రతీ విభాగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని అన్ని విషయాలను అడిగి తెలుసుకున్నట్లు ఎస్ఐ చంటి బాబు తెలిపారు.

# పారిశుధ్య నిర్వహణలో లోపం ఉండరాదు





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** పారిశుధ్య నిర్వాహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని అన్నారు ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రజారోగ్య శాఖ ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. సురేష్ బాబు, గురువారం ఉదయం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో గల నూతన భవనంలోని మీటింగ్ హాల్లో, లీడ్ వర్కులతో పారిశుధ్య నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని లోడర్ పాయింట్ల వద్ద లోడర్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రపరచాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారు పారిశుధ్య నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక యాప్ ఏపిసిఎంఎంఎస్ (ఆంధ్రప్రదేశ్ కన్సిస్టంట్ మానిటరింగ్ ఆఫ్ మున్సిపల్ సర్వీసెస్) లో ప్రతిరోజు అప్డేట్ చేయాలని తెలిపారు. ఈ యాప్ లో పారిశుధ్య నిర్వహణ కోసం వచ్చిన కార్మికుల హాజరు, ఇంటి వద్దనే వ్యర్థాల సేకరణ, ఒక్క సానిటరీ సెక్రటరీకి ఎన్ని హౌస్ హోల్డ్స్ ఉన్నాయి, వారి వద్ద నుండి చెత్త సేకరణ నిత్యం జరుగుతుందా లేదా వంటి విషయాలను ఈ యాప్‌లో పొందుపరచాలని అన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ బాబు శ్రీనివాస్, డాక్టర్ గోపీనాయక్, సానిటరీ సూపర్వైజర్లు, లీడ్ వర్కర్లు పాల్గొన్నారు.

## శ్రీ రామలింగేశ్వర స్వామి ఉపాలయాల శంకుస్థాపనలో ఎమ్మెల్యే సౌమ్య





**నందిగామ, మార్చి 6, మేజర్ న్యూస్:** పట్టణంలోని శ్రీ సుఖ శ్యామలాంబ సహిత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో నాలుగు మూలల ఉన్న శ్రీ రామేశ్వర, శ్రీ సోమేశ్వర, శ్రీ భీమేశ్వర, శ్రీ చంద్ర మౌళేశ్వర స్వామి ఉపాలయాల పునః నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురువారం ఉపాలయాల పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా వంశపారపర ధర్మకర్త వాసిరెడ్డి మురళి రాఘవ కుమార్, అర్చక పురోహితులు, ఆలయ కమిటీ సభ్యులు, మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణ కుమారి, కూటమి నేతలతో కలసి ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు చే దాదాపు 300 సంవత్సరాల క్రితం పునర్నిర్మాణమైన శ్రీ సుఖ శ్యామలాంబ సహిత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం చాలా ప్రసిద్ధిగాంచినదని ఈ దేవాలయమునకు నాలుగు మూలల శ్రీ రామేశ్వర, శ్రీ సోమేశ్వర, శ్రీ భీమేశ్వర, శ్రీ చంద్రమౌళేశ్వర స్వామి ఉపాలయాలు ఉన్నాయని జీర్ణోద్ధరణలో భాగంగా పునర్నిర్మాణ కార్యక్రమంలో పాల్గొనటం చాలా సంతోషదాయకమని తెలియజేశారు. అనంతరం అర్చక పురోహితులు వేద పండితులు తంగిరాల సౌమ్య ని ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో గంగాధర్, పట్టణ ప్రముఖులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



### జగన్ చిత్రాలను తగలబెట్టిన కూటమి నేతలు

**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** జనసేన అధినేత ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రాలను కూటమి నేతలు తగలబెట్టారు. గురువారం సాయంత్రం రాజీవ్ గాంధీ సెంటర్లో జగన్ రెడ్డి చిత్రాలను ప్రదర్శిస్తూ సైకో జగన్ నశించాలి అంటూ నినాదాలు చేశారు అనంతరం జగన్ ఫోటో ఉన్న చిత్రాలను తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొల్లూరి వెంకటేశ్వరరావు, మత్తి వెంకటేశ్వరరావు, బండే రాఘవ, గుడివాడ శేషుబాబు, మాచవరపు ఆదినారాయణ, రాయపూడి వేణుగోపాలరావు, బొప్పన భాను, రాజనాల వీరబాబు, పరుచూరి దుర్గాప్రసాద్, బచ్చు రఘునాథ్, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, షేక్ బాబావలి, గుడివాక శివరాం, మండలి రామ్మోహన్రావు, సింహాద్రి పవన్, ఎలవర్తి చిన్న, గుడివాడ రామాంజనేయులు, బచ్చు రమణ, తుంగల నరేష్, మెగావత్తు గోపి, కొట్టే విజయ్, విశ్వనాధుని మురళి, బచ్చు మురళి, బచ్చు రాఘవయ్య, గరికపాటి హరి, చెన్ను శివాజీ, తదితరులు పెద్ద ఎత్తున కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆవిర్భావ సభ విజయవంతం చేస్తాం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ అధికారంలోకి వచ్చాక పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో జరుగుతున్న తొలి ఆవిర్భావ సభ అద్వితీయ స్థాయిలో విజయవంతం చేస్తామని నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం జరిగిన జనసేన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో వెంకట్రామ్ మాట్లాడుతూ, జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభను విజయవంతం చేసేలా ఆరు మండలాల్లో సన్నాహక సమావేశాలు, ఈ నెల తొమ్మిదిన నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం ద్వారా పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తామన్నారు. రాష్ట్రంలో కూటమి ఆవిర్భావానికి కీలక పాత్ర పోషించటంతో పాటు, సార్వత్రిక ఎన్నికల్లో నూరు శాతం స్ట్రైక్ రేట్ సాధించి ప్రజల్లో తనకున్న జనాదరణ నిరూపించుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలోనూ విస్తృత గ్రామీణ అభివృద్ధికి పవన్ కళ్యాణ్ బాటలు వేస్తున్నారన్నారు. జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో జనసైనికులను, యువతను సమాయత్తం చేసి భారీగా చిత్రాడ సభకు వెళ్లేలా కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచనల మేరకు ప్రణాళికతో పని చేస్తామన్నారు. పార్టీ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్ మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణం కోసం పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. గతంలో సరైన దశ దిశా లేని అవనిగడ్డ నియోజకవర్గంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ రాకతో సమర్ధవంతమైన నాయకత్వం లభించిందని, ఎమ్మెల్యే మార్గదర్శకాలు అనుసరించి ఆవిర్భావ సభకు పెద్ద సంఖ్యలో శ్రేణులు తరలివెళ్లేలా కృషి చేస్తామన్నారు. ఇటీవల మాజీ సీఎం జగన్ తమ అధినేత పవన్ కళ్యాణ్ పట్ల హేళనగా మాట్లాడిన మాటలకు పిఠాపురం సభ ద్వారా జనసేనాని గట్టి సమాధానం చెబుతారన్నారు. జనసేన మండల అధ్యక్షులు గుడివాక శేషుబాబు మాట్లాడుతూ జనసేన ఆవిర్భావ సభ విజయవంతం అయ్యేలా నియోజకవర్గం నుంచి భారీగా జనసైనికులు కదలి వెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, సీనియర్ నాయకులు చన్నగిరి సత్యనారాయణ, టౌన్ పార్టీ అధ్యక్షులు రాజనాల వీరబాబు పాల్గొన్నారు.



## సురక్షితంగా వాహనాలు నడపాలి

### రహదారి భద్రత నియమాలను పాటించాలి

### రెండవ ట్రాఫిక్ డివిజన్ ట్రాఫిక్ ఏ.సి.పి. యస్.ఆర్.వంశీధర్ గౌడ్

**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** నగరములో రహదారి భద్రత అవగాహనలో భాగంగా గురువారం సుర్యరావుపేట, రామచంద్రరావు రోడ్లో వున్న శ్రీధర్ కాంపిటెటివ్ కోచింగ్ సెంటర్ లో ఎస్. వి. రాజ శేఖర్ బాబు, ఎన్.టి.ఆర్.జిల్లా పోలీసు కమీషనర్ వారి ఆదేశాలు అనుసరించి, ట్రాఫిక్ డిసిపి సూచనల మేరకు రెండవ ట్రాఫిక్ డివిజన్ ట్రాఫిక్ ఏ.సి.పి. యస్.ఆర్. వంశీధర్ గౌడ్, సి.ఐ వి.జానకి రామయ్య పాల్గొని రహదారి భద్రత నియమాల గురిచి అనగా ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారులు విధిగా శిరస్త్రాణం ధరించుట వలన వారి విలువైన ప్రాణములు కాపాడుకోవాలని విన్నవించుచూ, అవగాహన కల్పిస్తూ, రోడ్డు మీద ప్రయాణించే సమయంలో ప్రతివక్క పౌరుడు రోడ్డు పై ఏర్పాటు చేసిన వేగ పరిమితి, ప్రవేశం నిషిద్ధం, పార్కింగ్ నిషేదం, వాహన పార్కింగ్ ప్రదేశం, ఇతర సమాచార సూచిక బోర్డు లను అనుసరించి సురక్షితముగా వాహనాలు నడపాలని తెలిపారు. అదే విధంగా కోచింగ్ సెంటర్‌కు వచ్చు విద్యార్థులు కూడా విధిగా శిరస్త్రాణం ధరించాలని, సీటు బెల్ట్ ధరించాలని అదే విధముగా కోచింగ్ సెంటర్ నుండి వారి హాస్టల్స్, నివాస గృహాలకు వెళ్ళు నపుడు కోచింగ్ సెంటర్ పరిసర ప్రాంతాలలో ఇతరులకు ఏ విధమైన ఆటంకము కలిగించకుండా వేల్లవలేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ కాంపిటెటివ్ కోచింగ్ సెంటర్ యాజమాన్యం వారు పాల్గొని సహకరించారు.

## గీతకులాలకు లాటరీ ద్వారా మద్యం దుకాణాలు కేటాయింపు



**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, మార్చి 06, మేజర్ న్యూస్ :** గురువారం ఎన్‌టిఆర్ జిల్లా గీతకులాలకు సంబంధించిన మద్యం దుకాణాల కేటాయింపునకు సంబంధించి విజయవాడ రూరల్, గొల్లపూడి బీసీ భవన్ లో ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆధ్వర్యంలో లాటరీ ద్వారా షాపుల కేటాయింపు ప్రక్రియ నిర్వహించడమైనది. ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా అన్‌లైన్ ద్వారా, ఆఫ్‌లైన్ ద్వారా 335 దరఖాస్తులు 11 మద్యం దుకాణాలకు రావడమైనది. లాటరీ ప్రక్రియ ద్వారా 11 మద్యం దుకాణాలను దరఖాస్తుదారులకు కేటాయించడమయింది. 11 మద్యం దుకాణాలకు ప్రొవిజనల్ లైసెన్సు జారీచేయడం జరుగుతుంది. కార్యక్రమంలో ఎక్సైజ్‌అధికారులు టి.శ్రీనివాసరావు, ఎస్. శ్రీనివాసరావు, రామశివ, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999